క్లుప్తంగా

జగన్‌ను కలిసిన పార్టీ నేతలు



మాజీ సీఎం జగన్‌ను కలిసిన ముద్దాల అను, సింహాద్రి రామలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), మహిళా నాయకురాలు సింహాద్రి రామలక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ఆయనకు వివరించారు.

అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటు తగదు

కడియం: అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయడం తగదని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ స్పష్టం చేశారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలో అనుమతుల్లేకుండా ఎటువంటి విగ్రహాలను నెలకొల్పవద్దని విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధమైన ఇటువంటి కార్యకలాపాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు సామాజిక ఉద్రిక్తతలు తలెత్తే వకాశం ఉందన్నారు. సరైన అనుమతులు పొందిన తర్వాత మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే సదరు విగ్రహాలను తొలగిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దీని ప్రభావంతో స్వరూప్ నగర్ ఫీడర్ లైన్‌లోని బత్తిన నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయిదుర్గా నగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ఏరియాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.

నెలకో సంక్షేమ పథకం అమలు

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను నెలకొక్కటి చొప్పున అమలులోకి తీసుకువస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. దివాన్ చెరువులో గురువారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి అమలు అవుతుందన్నారు. మూడు గ్యాస్ సిలెండర్లు, మహిళలకు నెలకు రూ.1500 పథకాలు కూడా ఒకదాని తరువాత ఒకటిగా అమలు జరుగుతాయన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



షెల్టాన్ హోటల్ దగ్గర బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రకాశం నగర్: జాగృతి బ్లడ్ బ్యాంక్ జంక్షన్ నుంచి షెల్టాన్ హోటల్ జంక్షన్ వరకూ గల 1500 మీటర్ల నిడివి కలిగిన బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులను రూ.80 లక్షలతో చేపట్టినట్టు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ తదితర నాయకులతో కలిసి గురువారం ఆ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ నగరపాలక సంస్థ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	రాయన్
సూర్యమినీ	రాయల్
సూర్యప్యాలెస్	బడ్డీ
స్వామి	శివంభజే
శివజ్యోతి	ఏవరేజ్ స్టూడెంట్ నాని
	అలనాటి రామచంద్రుడు
అనుశ్రీ	శివంభజే
రాజా	తిరగబడరాసామి
రంభ	పురుషోత్తముడు
	ఎటో వెళ్లిపోతుంది మనసు
ఊర్వశి	ఉషా పరిణయం
మేనక	విరాజ్
కుమారి	తిరగబడరాసామి
అప్సర	డెడ్‌పూల్ అండ్ వోల్వెరిన్
అశోక	కల్కి 2898ఏడీ
నామవరం	
వీఎస్ మహల్	శివంభజే
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	బడ్డీ, రాయన్
కడియం	
వెంకటసూర్య	శివంభజే

గోదారి తీరంలో సంగీత తరంగం

- విజయ శంకర పాఠశాలలో సంగీతంలో శిక్షణ
- 49 ఏళ్లుగా నిర్విరామ సేవలు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు



వీణ నేర్చుకుంటున్న విద్యార్థులు



నాదస్వరం శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు

సీటీఆర్ఐ: చారిత్రక రాజమహేంద్రవరం నగరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రసిద్ధి చెందిన విద్యాలయాలు, వ్యాపార సంస్థలు, దేవాలయాలు..ఇలా ఎన్నో కనిపిస్తాయి. అలాంటి వాటిలో విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఒకటి. 1971లో ప్రఖ్యాత నృత్యకారుడు, అభినవ కృష్ణరాయ, ఆంధ్రభోజ, సరస్వతీ సామ్రాజ్య సార్వభౌమ బిరుదాంకితులైన నార్ని కేదారీశ్వరుడు ఈ పాఠశాలను స్థాపించారు. అనంతరం 1976 నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గోదావరి అలలు విన్నవారు, ఇక్కడి నీరు తాగిన వారు కళాకారులుగా రాణిస్తారని నానుడి. ఎంత బంగారు పళ్లానికైనా గోడ చేర్పు అవసరమైనట్టుగా చిన్న వయసు నుంచి మంచి గురువుల వద్ద శిక్షణ తీసుకుంటే వారిలోని నిజమైన ప్రతిభ బయటికి వస్తుంది. ఈ ప్రతిభను బయటకు తీయడానికి రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల నిర్విరామ కృషి చేస్తోంది.

ఏటా వందల మందికి శిక్షణ

కళాశాలలో ప్రతి సంవత్సరం డిప్లొమో, సీనియర్ సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తారు. సీనియర్ సర్టిఫికెట్ కోర్సులకు నాలుగేళ్లు, డిప్లమో కోర్సులకు రెండేళ్ల కాల వ్యవధి ఉంటుంది. ఏటా సుమారు 400 మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సులలో చేరుతున్నారు. వివిధ విభాగాలలో అత్యుత్తమ శిక్షణ ఇచ్చే ఆచార్యులు పర్యవేక్షణలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

విభాగాలు ఇవే..

కర్ణాటక సంగీతం, గాత్రం, వీణ, వయొలిన్, నాదస్వరం, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యంలో శిక్షణ అందిస్తారు. విద్యార్థులకు పాఠశాలలో శిక్షణ అందించడమే కాకుండా వారు నెలవారీ కార్యక్రమాలలో పాల్గొనేలా చేసి, వారి సాధనలో తప్పులుంటే సరిదిద్దుతారు. అంతే కాకుండా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో ప్రదర్శనలు నిర్వహించే అవకాశం కల్పిస్తారు. 2024 జనవరిలో సద్గురు త్యాగరాజస్వామి వారి 177వ ఆరాధనోత్సవం నిర్వహించారు. వీటిలో ఇక్కడ నేర్చుకుంటున్న విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రదర్శనలు ఇచ్చారు.

అర్హతలు ఇవే..

పదేళ్ల వయసు దాటిన వారు వివిధ కోర్సులలో ప్రవేశానికి అర్హులు. దరఖాస్తు రుసుం రూ.50 ఉంటుంది. సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు మొదటి ఏడాది రూ.1600, డిప్లమో కోర్సుకు రూ.2100 చెల్లించాలి. ఆర్ట్స్ కళాశాల వెనుక భాగంలో ఈ పాఠశాల ఉంది. శిక్షణ తరగతులు ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు ఉంటాయి.

మంచి అవకాశం

చిన్నారులకు చదువుతో పాటు వివిధ అంశాలలో శిక్షణ ఇవ్వడం చాలా అవసరం. తద్వారా వారికి ఆత్మవిశ్వాసం పెరగుతుంది. సంగీతంపై ఆసక్తి ఉన్నవారికి విజయ శంకర సంగీత పాఠశాల చాలా ఉపయోగంగా ఉంటుంది. శిక్షణ తరగతులను ఉదయం, సాయంత్రం వేళలో నిర్వహిస్తారు కాబట్టి పాఠశాలకు వెళ్లడానికి కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాగే ఉద్యోగులు, గృహిణులు కూడా తమకు ఇష్టమైన విభాగంలో చేరి నేర్చుకోవచ్చు.

అనేక అవకాశాలు



విజయ శంకర సంగీత, నృత్య పాఠశాలలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పదేళ్లు దాటిన వారెవ్వరైనా చేరవచ్చు. గృహిణులు, ఉద్యోగులు తగిన సమాయలలో నేర్చుకోనే అవకాశం ఉంది. శిక్షణ పొందిన వారికి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కల్పిస్తాం.

– డాక్టర్ ఎం.నాగలక్ష్మి, ప్రిన్సిపాల్, విజయ శంకర సంగీత, నృత్య పాఠశాల, రాజమహేంద్రవరం

మధ్యాహ్న భోజనం పరిశీలన



వంటనూనె, సాల్ట్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీఐ దిలీప్ కుమార్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ నాణ్యతను పరిశీలిస్తున్న దిలీప్ కుమార్

- 'సాక్షి' కథనానికి స్పందించిన డీఐ
- పాఠశాలను తనిఖీ చేసిన వైనం

సాక్షి ఇంపాక్ట్

కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐ) బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. 'సాక్షి' పత్రికలో గురువారం ప్రచురితమైన 'ముద్ద దిగేదెలా...' కథనానికి ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులతో కలిసి స్కూల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. వంటలో ఉపయోగిస్తున్న సాల్ట్, నూనె ప్యాకెట్లను పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నూనెను విడిగా కొనుగోలు చేయరాదన్నారు. పాకెట్లలో, డబ్బాలో నూనెను, అయోడైజ్డ్ ఉప్పును మాత్రమే వాడాలన్నారు. వంట నిర్వాహకులు వంటశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు భోజనం తినే ముందు, తిన్న తర్వాత విధిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం పేరును 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'గా మార్చినందున పాత బోర్డుల స్థానంలో కొత్త పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ లివింగ్‌స్టన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రేపు జాబ్ మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ, ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన విద్యార్థులు 8 బహుళజాతి సంస్థల్లోని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ అర్హత ఒరిజినల్, జిరాక్సు కాపీలు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కళాశాల జేకేసీ విభాగాన్ని సందర్శించవచ్చని తెలిపారు.

జీవో నంబర్ 84ను రద్దు చేయాలి

కంబాలచెరువు: జీవో నంబర్ 84ను రద్దు కోరుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ఎస్టీయూ నగర శాఖ గురువారం వినతిపత్రం అందజేసింది. నగర శాఖ అధ్యక్షుడు ఏ.విశ్వేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ ఏ.సూరిబాబు, ప్రధాన కార్యదర్శి దాసరి శివసత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ముత్యాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కడియం: మండలంలోని వేమగిరి కెనాల్ రోడ్డులో కొలువైన ముత్యాలమ్మ గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నాగేశ్వరరావు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉపాధ్యాయురాలు పద్మ సేవలు అభినందనీయం



టీచర్ పద్మ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేసి స్వచ్ఛంద విరమణ చేసిన భావరాజు పద్మ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 30 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఏడు పాఠశాలల్లో పనిచేసి ఆయా గ్రామస్తులు, అధికారులు, విద్యార్థుల మన్ననలు పొందారన్నారు. ఈ మేరకు హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. టీచర్ పద్మ దంపతులను ఎంఈవో వై.నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.10 వేల విలువైన ఇనుప బీరువాను పద్మ అందజేశారు. సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు భారీ పూలమాలలతో సత్కరించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ మెజీషియన్ రమణమూర్తి మ్యాజిక్ షో, చిన్నారులు శరణ్య బృందం చేసిన నాట్య ప్రదర్శను ఆకట్టుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు డేవిడ్, రఫీయుద్దీన్, సువర్ణవేణి, పుష్పకుమారి, నాగమణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై విస్తృత పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రకాశం నగర్: ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. తాడితోటలోని సంహిత ఫంక్షన్ హాలులో గురువారం జిల్లా అధ్యక్షుడు తాటిపాక మధు అధ్యక్షతన సీపీఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీకి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి నూరు వసంతాలు నిండుతాయన్నారు. ఈ సందర్భంగా 2024 డిసెంబర్ 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకూ ఏడాది పాటు శతదినోత్సవం ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ గ్రామాలలో అనేక ప్రజా సమస్యలు నెలకొన్నాయన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతిరాజు, చింతలపూడి సునీల్ ప్రసంగించారు. అంతకుముందు ప్రజానాట్యమండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంతి లక్ష్మణరావు నాయకత్వంలో పలు విప్లవ గీతాలను ఆలపించారు. వయనాడ్ సీపీఐ సహాయనిధికి జిల్లా నుంచి 10,120 ఆర్థిక సహాయం అందించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రకాశం నగర్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ నగర శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు వైరాల అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక సిమెంట్రీ పేటలో మంద కృష్ణ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా వచ్చిన ఈ తీర్పుతో మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న సుబ్బరావు, తాలేటి ప్రసాద్ పాల్గొన్నారు.

కవితాక్షరానికి వన్నెలద్దిన తిలక్



సమావేశంలో మాట్లాడుతున్న విశాలాక్షి

సీటీఆర్ఐ: కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల ప్రభావంతో భావాభ్యుదయ కవిత్వాన్ని ఆవిష్కరించిన మానవతావాది దేవరకొండ బాల గంగాధర తిలక్ అని ఎస్‌కేఆర్ డీఈడీ మహిళా కళాశాల తెలుగుశాఖాధిపతి విశాలాక్షి అన్నారు. కళాగౌతమి, ఎస్‌కేవీటీ తెలుగుశాఖ సంయుక్త నిర్వహణలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో గురువారం తిలక్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాలాక్షి మాట్లాడుతూ కరుణ, సౌందర్యం, మానవత్వం తిలక్ కవిత్వానికి ప్రాతిపదికలన్నారు. సభకు అధ్యక్ష వహించిన తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ తిలక్‌ను సౌందర్య, కారుణ్య కవిగా అభివర్ణించారు. సమావేశంలో ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని నగర పాలకసంస్థ డివిజన్లలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ గురువారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, పార్టీ నేతలు ఆయన వెంట ఉన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

కడియం: వేమగిరిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని గురువారం ఆర్డీవో, రూరల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి నాయక్ పరిశీలించారు. అలాగే మండలంలో జరుగుతున్న తీరును సంబంధిత నోడల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు. మండల కేంద్రమైన కడియంలో తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ పర్యవేక్షించారు. అలాగే వివిధ గ్రామాల్లో ఆయా నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు 90 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. 11 గ్రామాల పరిధిలోనూ 248 మంది సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేస్తున్నారన్నారు. 17 మంది మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. మండల కేంద్రమైన కడియంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పంపిణీని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేయాలి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ట్రాఫిక్, పట్టణ ప్రణాళికా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ముఖ్యకూడళ్లలో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. వాటిలో కొన్ని ప్రస్తుతం పనిచేయడం లేదని, వాటిని బాగుచేయాలన్నారు. అదనంగా సీసీ కెమెరాలు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ట్రాఫిక్ విభాగంలోని మహిళా పోలీసులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, రద్దీ జంక్షన్లలో అదనంగా సిబ్బందిని నియమించాలన్నారు. వాహనాలు ఎక్కువగా తిరిగే కూడళ్లను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గతంలో చిరు వ్యాపారులు తమ వస్తువులు విక్రయించుకోవడానికి వెండింగ్ జోన్లను గుర్తించారని, వాటిని పరిశీలించి ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేయాలన్నారు. దాతలను గుర్తించి వారి ద్వారా జంక్షన్ల అభివృద్ధికి ప్రయత్నాలు చేయాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, సిటీ ప్లానర్ డీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటి సిటీ ప్లానర్ వి.బాలాజీ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

నగరపాలక సంస్థ సిబ్బంది అంకిత భావం, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనన, మరణ విభాగంలో ధ్రువీకరణ పత్రాలు జారీచేసే విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

రాజానగరం: ద్విచక్ర వాహన చోదకులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు చాలామంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు నుంచి తేరుకున్న వీధులు

రాజమహేంద్రవరం రూరల్: అధిక వర్షాలు, గోదావరి వరద ప్రవాహంతో వారం రోజులుగా ముంపునకు గురైన బొమ్మూరు, హుకుంపేట గ్రామాల్లో వీధులు సాధారణ స్థితికి చేరుకున్నాయి. వీధుల్లోని నీరంతా ఆవ కాలువల్లోకి చేరింది. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బొమ్మూరు నేతాజీ నగర్, హుకుంపేట రామకృష్ణ నగర్, సావిత్రీ నగర్ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మురుగునీరు మాత్రం అక్కడే నిలిచిపోయింది. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. రెండు రోజుల పాటు పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లడంతో పాటు, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు. వారం రోజులుగా ముంపు నీటితో అనేక ఇబ్బందులు పడ్డామని, గోదావరికి వరద వచ్చిన ప్రతిసారీ తమకు ఇదే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మొబైల్ షాప్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

కంబాలచెరువు: దేవీచౌక్‌లోని సత్యా రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ప్రతాప్ మొబైల్ షాపు దగ్ధమైంది. దీనిపై షాపు మేనేజర్ మామిడి వెంకట శ్రీనివాస్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మొబైల్ దుకాణానికి బుధవారం రాత్రి యథాతథంగా తాళం వేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. గురువారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడాన్ని పక్కనే ఉన్న పాల దుకాణం వ్యక్తి చూశాడు. వెంటనే మొబైల్ షాపు నిర్వాహకులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో దుకాణంలోని రూ.40 వేలు విలువైన కీప్యాడ్ మొబైల్స్, మొబైల్ యాక్సరీస్, రూ.77,500 నగదు కాలిపోయినట్లు దుకాణం మేనేజర్ వెంకట శ్రీనివాస్ తెలిపారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే దుకాణం షట్టర్‌ను కొంతమేర లేపి నిప్పుపెట్టారని ఆయన చెబుతున్నారు. దీనిపై ఇంకా ఎటువంటి కేసు నమోదు కాలేదు.